క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రవికుమార్

గజ్వేల్‌రూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని, సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీ షీటర్లకు సీఐ రవికుమార్ సూచించారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్టేషన్ పరిధిలో ప్రజల రక్షణకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని నిర్మూలించేందుకు కృషి



మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీను

చిన్నకోడూరు(సిద్దిపేట): నేర ప్రవృత్తిని నిర్మూలించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. చిన్నకోడూరు పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషుల్లో స్వార్థం పెరిగిపోవడం వల్లే బంధాలు, ఆప్యాయత, అనురాగాలు తగ్గిపోతున్నాయన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

వార్డెన్ నిర్లక్ష్యం వల్లే..



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

హుస్నాబాద్: హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆరోపించారు. పట్టణంలోని బీసీ హాస్టల్‌ను సోమవారం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. విద్యార్థుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డెన్, పాఠశాల హెచ్‌ఎం మందలించడం కారణంగానే ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనంత స్వామి, రాంప్రసాద్, నరేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

వానాకాలం పంటలపై అవగాహన



సాయికిరణ్

దౌల్తాబాద్(దుబ్బాక): వానాకాలంలో సాగు చేసే పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంటలలో సాగు వివరాలు, వినియోగించే యంత్ర పరికరాలు, చీడపీడలు, నివారణ లాంటి అంశాలపై మండల పరిధిలోని ముబారస్‌పూర్, దొమ్మాట రైతు వేదికలలో మంగళవారం వివరిస్తామని, రైతులంతా హాజరవ్వాలని కోరారు.

ఘనంగా రేగడమ్మ జాతర



ఎస్‌ఐను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో రేగడమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని, ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సత్యం, తిర్మలాపూర్ బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు అంగడి జలంధర్, రమేశ్, స్వామి గౌడ్, మధు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఆస్పత్రి

ఇరవై నాలుగు గంటలపాటు సేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రి ప్రస్తుతం విద్యుత్ సౌకర్యం లేక అంధకారంగా మారింది. దీంతో నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సమస్యతో ప్రసవాల సేవలు నిలిచిపోయాయి. రాత్రి పూట విషప్పురాలు వచ్చి భయపెడుతున్నాయని సిబ్బంది, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిగుల్ ప్రభుత్వాస్పత్రిలో తిప్పలు
- నలభై రోజులుగా విద్యుత్ కష్టాలు
- గర్భిణులను గజ్వేల్‌కు తరలింపు
- కష్టాల్లో సిబ్బంది, రోగులు



తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వైర్లు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలం పరిధి తిగుల్ గ్రామంలోని ఆస్పత్రి భవనం నిర్మించి ఎన్నో యేళ్లు కావస్తోంది. దీంతో భవనంపై కప్పు బీటలు బారి పెచ్చులూడే స్థితికి చేరుకుంది. దీంతో విద్యుత్ వైర్లు కలిసి పోవడం వల్ల షార్టు సర్క్యూట్‌తో వైరింగ్ మొత్తం పూర్తిగా కాలిపోయింది. స్విచ్ బోర్డులు, బల్బులు, ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. నూతనంగా వైరింగ్ చేయాలని, అందుకు రూ.6 లక్షలకు పైగా ఖర్చవుతుందని ఎలక్ట్రిషియన్ చెప్పినట్లు వైద్యాధికారి చెప్పారు. హాస్పటల్ అభివృద్ధి ఫండ్ కింద ప్రతి ఆరు నెలలకు రూ. 60 వేలు రావడంతో అవి సాధారణ ఖర్చులకే సరిపోతున్నాయని వాపోయారు.

తాత్కాలికంగా మూడు గదులకు..

చిన్న పిల్లలకు వ్యాక్సిన్ ఇచ్చే గది, రోగులకు మందులు అందించే గదితో పాటు పరీక్షలు నిర్వహించే గదులకు మాత్రం ప్రస్తుతం తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. మిగతా గదులన్నీ చీకటిమయంగా మారాయి. దీంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆగిన డెలివరీ కేసులు

ఇరవై నాలుగు గంటలు సేవలందించే ఈ ప్రభుత్వ ఆస్పత్రిలో నలుబై రోజులుగా విద్యుత్ లేకపోవడంతో డెలివరీ కేసులు నిలిచిపోయాయి. నెల రోజుల్లో రెండు కేసులు రాగా వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిత్యం వివిధ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను

నెల రోజులుగా ఆస్పత్రిలో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. వైరింగ్ మొత్తం కాలిపోవడంతో బల్బులు వెలగడం లేదు, ఫ్యాన్లు తిరగడం లేదు. నిత్యం రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. అధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులు చేయిస్తాం.

– రాజశేఖర్, వైద్యుడు

సత్యసాయి సంస్థల సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎమ్మెల్యే హరీశ్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న సేవా సంస్థల ప్రతినిధులు

గజ్వేల్: సత్యసాయి సేవా సంస్థల సేవలు అభినందనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్‌లోని సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న దేవతామూర్తుల కల్యాణోత్సవ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిస్సహాయస్థితిలో ఉన్న పేదలకు సత్యసాయి సంస్థలు అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావజాలాన్ని విస్తరింపజేయడానికి సంస్థలు ఎంతో కీలకంగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు నిర్వాహకులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, సేవా సమితి ప్రతినిధులు వెంకటనర్సింహారెడ్డి, చెలిమేటి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

‘డివిజన్’ సాధించే వరకు ఉద్యమం ఆగదు

జేఏసీ నేత నర్సింహాచారి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను సాధించేంత వరకు జేఏసీ ఉద్యమిస్తుందని జేఏసీ నాయకుడు వలబోజు నర్సింహాచారి అన్నారు. సోమవారం ధూళ్మిట్టలో నిర్వహించిన చేర్యాల డివిజన్ సాధన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల నియోజకవర్గ కేంద్రంగా, తాలూకాగా ఉండి నేడు ఆ అస్తిత్వాన్ని కోల్పోయి పూర్తిగా వెనుకబడిందని వాపోయారు. జేఏసీ ఏర్పడి పది సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు నిర్వహించినప్పటికీ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో రెవెన్యూ డివిజన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నేటి ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 25న జేఏసీ తలపెట్టిన నాలుగు మండల కేంద్రాల బంద్‌లో పార్టీలకు అతీతంగా వ్యాపారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీధర్, నర్సింహారెడ్డి, సంపత్, బాలయ్య, కనకయ్య, బాలరాజు, పెద్దకనకయ్య, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ఏసీపీ సదానందం



సిబ్బంది సామగ్రిని పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

చేర్యాల(సిద్దిపేట): పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం చేర్యాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని, వీపీఓ వ్యవస్థను మెరుగుపరచాలని, వారంలో 2, 3 సార్లు గ్రామాలు సందర్శించాలని సిబ్బంది, అధికారులకు సూచించారు. స్టేషన్ పరిధిలోని కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై నిఘా ఉంచాలని చెప్పారు. ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్‌ఐ నవీన్, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి సరిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఆరో తరగతిలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97040 62004కు కాల్ చేయాలని కోరారు.

రేపు రేషన్‌కార్డుల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): పేద ప్రజలు పదేళ్లుగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డుల కల కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నెరవేరిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి రెండు విడతలలో 901 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, స్థానిక సీఎస్‌హెచ్ ఫంక్షన్ హాల్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు బుధవారం అందించనున్నట్టు తెలిపారు.

13న దివ్యాంగుల మహాసభ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వచ్చేనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న దివ్యాంగుల మహాగర్జన మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు తరలివచ్చి మహాసభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మృతుడి కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న సంతోష్ కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన యాద కనకయ్య కుటుంబ సభ్యులను కురుమ సంఘం మండల అధ్యక్షుడు అక్కి సంతోష్ కుమార్, సభ్యులు సోమవారం పరామర్శించారు. 50 కిలోల బియ్యం, నగదును అందజేశారు. వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించి బీఆర్‌ఎస్ సత్తా చాటాలని మానకొండూర్ మజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. ఓ స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమాయత్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేసి హామీలు నెరవేరక ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ముఖ్య నాయకుల అభిప్రాయం మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తామని, ప్రతి గ్రామంలో ఎంపికైన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో సిద్దం వేణు, నిర్మల, శ్రీనివాసరావు, శ్రీనివాసగుప్తా, లక్ష్మణ్, తిరుపతి, తిరుపతిరెడ్డి, వివిధ నాయకులు పాల్గొన్నారు.

భయపెడుతున్న గుంతలు



దుబ్బాక రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

దుబ్బాకటౌన్: దుబ్బాకలో పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతలు వాహనదారులను కలవర పెడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి పట్టణంలోని అంగడి బజారులో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తోంది. మూడు దారులకు వెళ్లే కూడలి కావడంతో వాహనాలపై నుంచి జారిపడుతున్నామని వాహనదారుల వాపోతున్నారు. నడిచి వెళ్లాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో దోమలు, ఈగల విజృంభిస్తున్నాయి. అసలే సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు గుంతలు పూడ్చి నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కస్తూరిపల్లిలో బోనాల తరలివస్తున్న మహిళలు

బోనం.. ఘనం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కస్తూరిపల్లిలో సోమవారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో బోనాలు ఊరేగించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

కేజీబీవీలో..

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కేజీబీవీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పాఠశాలలో విద్యార్థినులు బోనాలు తయారుచేసి అమ్మవారి వద్దకు తీసుకువెళ్లి నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థినుల పోతరాజుల వేషధారణలో నృత్యాలు చేస్తూ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేజీబీవీలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు

సమస్యలపై దశల వారీ పోరాటం

సిద్దిపేటకమాన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దశల వారీ పోరాటాన్ని విజయవంతం చేయాలని యుఎస్‌పీఎస్ నాయకులు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని, నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులు, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, కిష్ట, నరేందర్, కృష్ణ, మనీష్, శివాజీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సంఘ కార్యవర్గం

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా రమేశ్‌చందర్, ప్రధాన కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా భగవాన్, రవీందర్, మల్లేశం దుర్గాదాస్, మురళి, నాగయ్య, ఐలయ్య ఎన్నికయ్యారు.

24న భద్రగిరి ప్రదక్షిణ

గజ్వేల్‌రూరల్: శ్రీరామచంద్రుడి జన్మ నక్షత్రాన్ని (పునర్వసు) పురస్కరించుకొని 24న భద్రాచల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రగిరి ప్రదక్షిణలో పాల్గొనాలని రామకోటి భక్తసమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం ఆరు గంటలకు గిరి ప్రదక్షిణ మొదలవుతుందన్నారు.

భూ భారతిపైనే ఆశలు

- జిల్లా వ్యాప్తంగా 42,680
- సాదాబైనామాలకు మోక్షం కలిగేనా?
- ఎదురు చూస్తున్న రైతులు
- 932 ఎకరాలు సీలింగ్ భూములుగా నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకొవచ్చిన భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. యేళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలు ఇకనైనా తీరుతాయని అన్నదాతలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక

భూ భారతి చట్టం పైలట్ ప్రాజెక్టుగా అక్కన్నపేట మండలాన్ని ఎంపిక చేశారు. దానిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 42,680 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో మొత్తం 37 గ్రామాలకు గాను 14 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 4,183 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇప్పటి వరకు సుమారుగా 1,423 దరఖాస్తులపై విచారణ చేపట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా సాదాబైనామాలకు 1,630, అసైన్డ్ భూములకు 413 దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రస్తుతం భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, విరాసత్, పట్టా పుస్తకంలో పేరు మార్పిడి, తప్పుఒప్పులు, డీఎస్ పెండింగ్ ఇలా చిన్న చిన్న వాటిపై దరఖాస్తుదారులకు నోటీసులు ఇచ్చి విచారణ జరుపుతున్నారు.

932ఎకరాలు సీలింగ్ భూములు

నందారం రెవెన్యూ గ్రామ పరిధిలోని 1,456 ఎకరాల విస్తీర్ణం ఉంది. అందులో 401ఎకరాలు ప్రభుత్వ భూమి, 123 ఎకరాలు పట్టా భూమిగా ఉంది. మిగిలిన 932 ఎకరాల భూమి 1,992లో సీలింగ్ భూములుగా నమోదయ్యాయి.

మోక్షం కలిగేనా?

సాదాబైనామా ద్వారా మండల వ్యాప్తంగా 1,630 మంది రైతులు దరఖాస్తులు చేయగా ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉండడంతో దరఖాస్తులు అన్నీ పక్కన పెట్టేశారు. అలాగే అస్సైన్ భూములకు 413 మంది దరఖాస్తులు చేయగా ప్రభుత్వ భూములపై హక్కుల కల్పించేలా ప్రభుత్వ నిర్ణయం చేసుకోవల్సి ఉంది. దీంతో సాదాబైనామా, ప్రభుత్వ భూములపై దరఖాస్తులను పరిష్కారం ఇప్పట్లో లేనట్లే అన్నట్లు రెవెన్యూ అధికారుల ద్వారా తెలుస్తుంది.

33 యేళ్లుగా పోరాటం

ఈ సీలింగ్ నమోదును ఎత్తివేయాలని 33 యేళ్లుగా అక్కడి రైతులు పోరాడుతున్నారు. గతంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను సైతం బహిష్కరిస్తూ ప్రకటనలు చేయడంతో ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు హామీలు ఇచ్చారు. ఈ తరుణంలో గత బీఆర్‌ఎస్ హయాంలో సీలింగ్ భూములకు క్రాప్ లోన్‌లు, ఇతర రాయితీలు కల్పించారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో క్రాప్ లోన్ కాదుకదా.. ఆన్‌లైన్‌ల్లో సీలింగ్ భూములుగా రావడంతో అక్కడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీలింగ్ అంశాన్ని వెంటనే ఎత్తివేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నోసార్లు విన్నవించామని రైతులు వాపోతున్నారు.



రెవెన్యూ సదస్సులో ఆర్డీఓను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు(ఫైల్)

సీలింగ్ ఎత్తివేయాలి

పచ్చని పంట పొలాలు సీలింగ్ భూములుగా నమోదయ్యాయి. ఈ సీలింగ్ నమోదును వెంటనే ఎత్తివేయాలి. గతంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించినప్పుడల్లా సీలింగ్ ఎత్తివేస్తామని చెప్పింద్రు. చాలా కాలంగా సాగు చేసుకుంటున్న రైతులకు ఇప్పుడు భూమిపై హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం ఈ సీలింగ్‌ను ఎత్తివేయాలి. లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం.

– భానోతు సంతోష్‌నాయక్, మాజీ సర్పంచ్

క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. సాదాబైనామాలు, ప్రభుత్వ భూములపై వచ్చిన దరఖాస్తులను పక్కన ఉంచాం. ఈ రెండు అంశాలపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాకే పరిశీలిస్తాం.

– అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట మండలం